

# తప్పక చూడండి!

డి. వెంకట్రామయ్య

శ్రీరాముడు రావణాసురుణ్ణి చంపడానికి పుట్టాడు. గాంధీగారు దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడానికి పుట్టాడు.

గాడ్సే గాంధీగారిని చంపడానికి పుట్టాడు.

ఇందిరాగాంధీ దేశంలో దారిద్ర్యాన్నంతటినీ తన్ని తగిలేసి, ఎంచక్కా సోషలిజం తీసుకురావడానికి పుట్టింది.

ఇలాగే ఇంకా చాలామంది గొప్పవాళ్ళు ఇలాంటివే చాలా చాలా గొప్ప పనులు చెయ్యడానికి పుట్టారు. అలాంటి వాళ్ళందర్నీ కారణజన్ము లంటారు. వాళ్ళందరిలాగే తనుకూడా కారణజన్ముడనీ, సినిమాలు తియ్యడమనే మహత్కార్య సాధనకోసమే తను పుట్టాడనీ చిత్రాంగదరావు నమ్మకం.

అతను పుట్టకముందే చాలామంది సినిమాలు తీశారు. పుట్టాక కూడా చాలామంది సినిమాలు తీశారు; తీస్తున్నారు కూడాను.

అందుకు చిత్రాంగదరావేమీ బాధపడలేదు. కాని వాళ్ళూ వీళ్ళూ తీసిన సినిమాలు చూసి తరుచు బాధపడుతూ వుంటాడు. అప్పుడప్పుడూ ఏడ్చినంత పనిచేస్తాడు.

తనలాగే సినిమాలు చూసి బాధపడే వాళ్ళ బాధావిముక్తికోసమూ, సంతోషించేవాళ్ళ అజ్ఞానాంధకారాన్ని తొలగించటంకోసమూ, ఇంతకుముందు వచ్చిన, యిప్పుడు వస్తున్న సినిమాలన్నిటికంటే కూడా గొప్ప సినిమాలు తీసిపారెయ్యాలని చిత్రాంగదరావు చిన్నప్పుడే గట్టిగానిశ్చయించుకున్నాడు.

తెలుగుదేశమంతటా, యావద్భారత దేశంలోనూ, ఆ మాటకొస్తే యావత్ప్రపంచంలోనూ, తను తియ్యబోయే మహత్తర చలనచిత్రాలతో మహాసంచలనం రేకెత్తించాలన్నది చిరకాలంగా చిత్రాంగదరావుకున్న కోరిక; ఎన్నాళ్ళుగానో పెంచుకున్న ఆశ; జీవితాశయం!

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందట! అలాగే చిత్రాంగదరావుకి కూడా చిన్నప్పుడే సినిమా తియ్యాలన్న సద్బుద్ధి కలిగింది.

పన్నెండేళ్ళ వయసులో వొకసారి వాళ్ళమ్మతో కలిసి సినిమాకెళ్ళాడు చిత్రాంగదరావు. సినిమా చూసి బయటికి రాగానే, 'అమ్మా, నేనూ సినిమా తీస్తానే' అంటూ ఏడుపు మొదలెట్టాడు. 'ఛీ వెధవా! వేలెడంతలేవు; అన్నీ పాడుబుద్ధులే' అని రెండు మొట్టికాయలు వేసింది వాళ్ళమ్మ.

ఇంకాస్త పెద్దవాడయ్యాక, మరోసారి వాళ్ళ నాన్నతో—'నాన్నా! నేను సినిమా తీస్తాను, నాకు డబ్బులియ్యవా?' అని అడిగాడు చిత్రాంగదరావు.

చిత్రాంగదరావు తండ్రి, జేబులోంచి వొక అర్ధరూపాయి తీసియిచ్చాడు. ఇచ్చి, 'ఇంద! ఇదట్టుగెళ్ళి సినిమా చూడు. అంతేగాని వెర్రివేషాలెయ్యక; సినిమా తీసేంత డబ్బు మనకెక్కడిది? అంత డబ్బే వుంటే నే నెప్పుడో తీసేవాణ్ణి; ఇప్పటిదాకా వూరుకునేవాడినా?' - అని మెత్తగా చివాట్లేశాడు.

చిత్రాంగదరావు తండ్రికి కూడా సినిమాలు తియ్యాలన్న కోరిక వుండేది. అయితే అందుక్కావలసిన డబ్బు పేకాటలో గెలవాలన్న కోరిక యింకా ఎక్కువగా వుండేది. తత్ఫలితంగా వున్న కాస్త డబ్బూ పేకాటలో వూడ్చిపెట్టుకుపోవడమూ, చివరికి సినిమా తియ్యకుండానే ఆయన అవతారం చాలించడమూ వేరే కథ.

చిత్రాంగదరావు పెద్దవాడైపోయాక

ఒకనాడు ఒక స్నేహితుడితో — 'నాకు సినిమా తియ్యాలని వుందిరా' అన్నాడు. ఆ స్నేహితుడు చిత్రాంగదరావు వంక ఎగాదిగాచూసి, 'ఇ హి హి' అని నవ్వి, 'నువ్వు సినిమా తియ్యటమేమిటిరా నీ మొహం!' అని పెద్దగా మరోసారి నవ్వి, చిత్రాంగదరావు దగ్గర ఒక సిగరెట్ తీసుకుని వెనక్కి-తిరిగిచూడకుండా వెళ్ళి పోయాడు.

సినిమా తియ్యందే పెళ్ళిచేసుకో గూడదనుకున్నాడు చిత్రాంగదరావు. అసలెవరైనా సినిమాతారనే పెళ్ళాడదా మనుకున్నాడు.అయితే సినిమాతియ్యటం కాస్త ఆలస్యమయ్యేట్టుగా వుందని, పెళ్ళి చేసేసుకున్నాడు. సినిమాతారని పెళ్ళాడ్డం కుదరలేదుగనక, తనభార్యనే వో పెద్ద తారగా తయారుచెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

పెళ్ళయిన కొత్తలో వొకసారి భార్యతో-'నేను సినిమా తీస్తాను; నువ్వే హీరోయిన్వి!'-అన్నాడు. చిత్రాంగదరావు భార్య వెంటనే మూర్చిల్లి, అయిదు రోజుల తర్వాత తేరుకుని, 'నేను చచ్చినా మిమ్మల్ని సినిమా తియ్య నివ్వను; ఛస్తే నేను వేషం వెయ్యను!' అని శపథం చేసింది.

ఈ రకంగా సినిమాకి సంబంధించిన విషయాల్లో చిత్రాంగదరావుతో. పాపం ఎవరూ సహకరించలేదు. సినిమా తీస్తా నని చిత్రాంగదరావు ఎవరితో అంటే వాళ్ళు ఎగతాళి చేశారు: వేళాకోళ మాడారు; వెక్కి-రించారు; చివాట్లుకూడా వేశారు.

సినిమా తియ్యడానికి చాలా డబ్బు కావాలి. అంత డబ్బు చిత్రాంగదరావుకి లేదు. నేను సినిమా తీస్తాను; డబ్బు పెట్టుబడిపెట్టమని చిత్రాంగదరావు చాలా మందిని అడిగాడు. కాని ఎవరూ యివ్వ లేదు.

చిత్రాంగదరావుకి దూరపు బంధు వొకాయన వున్నాడు. ఆయనకి బాగా డబ్బుంది. ఏదో పెద్ద జబ్బుకూడావుంది. ముసలివాడై పోయాడు.

చిత్రాంగదరావు ఒకనాటి పొద్దున్నే ఆయన దగ్గరకెళ్ళి, 'బాబాయ్ నీకు చాలా డబ్బుంది; మరీ అంత డబ్బు ఏం చేసుకుంటావ్? పైగా నువ్వెలాగూ త్వరలో చచ్చిపోతావ్; చచ్చిపోయే ముందు ఒక మంచిపని చేసి చచ్చిపో; నా కొక లక్షరూపాయలివ్వు; సినిమా తీస్తాను'-అన్నాడు.

దాంతో ఆ ముసలాయన అగ్గి రాముడై పోయి, "నేనింకా పదేళ్ళదాకా ఛస్తే చావను; నేను బతికుండగా ఇలాంటి వెధవ పనులకి పైసాయివ్వను; మళ్ళీ నాకు కనపడకు పో!"-అని చివా ట్లేసి పంపాడు.

ఇలాంటి ఎదురుదెబ్బలు ఇంకా చాలా తగిలాయి చిత్రాంగదరావుకి.

కాని — చిత్రాంగదరావు కారణ జన్ముడు. అంచేత-ఎన్ని అవాంతరాలూ ఆపదలూ వచ్చినా చలించలేదు. ఏమైనా సరే, ఎప్పటికైనా సరే, సినిమా తీసి తన జన్మని సార్థకం చేసుకోవలసిందే నని నిశ్చయించుకున్నాడు.

చిత్రాంగదరావుకి సినిమా పరిశ్రమకి చెందిన పరిజ్ఞానం బాగావుంది. వచ్చిన ప్రతి సినిమా విడవకుండా చూస్తాడు. తను చూసిన ప్రతి సినిమాగురించీ తీవ్రంగా ఆలోచిస్తాడు. అదే సినిమా తనేగనక తీసివుంటే ఎలావుండేదో వూహించుకుంటాడు. తను తియ్యబోయే సినిమాలగురించి కలలు కంటాడు.

సినిమా పత్రికలద్వారా కూడా చిత్రాంగదరావు చాలా విజ్ఞానాన్ని పొందుతూ వుంటాడు. సినిమా పరి శ్రమతో సంబంధించిన వ్యక్తులెవరు తారసపడినా వాళ్ళవెంటబడి, మరికొంత విజ్ఞానాన్ని సేకరిస్తూ వుంటాడు.


ఈ విధంగా సినిమా విజ్ఞానం విప రీతంగా సంపాదించిన తదుపరి-చిత్రాం గదరావు రంగంలోకి దూకాడు.

మొదట-సినిమా పత్రికలకి ఉత్త రాలు రాయడం ప్రారంభించాడు.

"ఆర్యా! 'పిచ్చిమనసులు' చిత్రంలో ప్రసిద్ధ నటీమణి సుబ్బశ్రీ విషముత్రాగు సన్నివేశములో ఆమె మెడలో ముత్యాల హారమున్నది. కాని, విషము త్రాగిన తర్వాత భరతనాట్యము చేయునప్పుడు ఆమె మెడలో ముత్యాలహారమునకు బదులు రాళ్ళ నెక్లెస్ వున్నది. ఇది ఎంతయూ శోచనీయమైన విషయము; ఇట్టి లోపములుండుట వల్లనే మన చిత్ర పరిశ్రమ ముందుకు నడవలేకపోవు చున్నది"-ఇలాంటి లేఖలు పుంఖాను పుంఖంగా అనేకం రచించాడు చిత్రాం గదరావు. ఆ తర్వాత సినిమా సమీ క్షలూ, ఆ పైన సినిమాలకి సంబంధిం చిన సర్వ విషయాలపైనా వ్యాసాలూ రాయడం ప్రారంభించాడు.

తన లేఖలద్వారా, విమర్శలద్వారా, వ్యాసాలద్వారా సినిమాలగురించి తన కున్న అపారమైన విజ్ఞానాన్ని దేశ మంతటా వెదజల్లడం ప్రారంభించాడు. ఫలానా చిత్రంలో ఫలానా నటుడు ఫలానా సన్నివేశంలో సరిగా ఏడవ లేదనీ, ఫలానా నటీమణి నిద్రపోయే సన్నివేశంలో ఇంకా బాగా నటించి వుండవలసిందనీ, ఫలానా దర్శకుడు ఫలానా సన్నివేశాన్ని సరిగా చిత్రించ లేకపోయాడనీ విమర్శలు చెయ్యడం ప్రారంభించాడు.

కొంతకాలానికి చిత్రాంగదరావ్ కీర్తి ప్రతిష్ఠలు సినిమారంగంలో వ్యాపిం చాయి. అతని శక్తిసామర్థ్యాలు అందరికీ తెలిసిపోయాయి. చిత్రాంగదరావ్ స్వయంగా సినిమా వాళ్ళందరిదగ్గరకీ వెళ్ళి "ఫలానా పత్రికలో ఆ వుత్తరం రాసింది నేనే; ఈ వ్యాసం రాసింది నేనే అంటూ తనని తానే పరిచయం చేసు




కుంటూ పరిచయాలు పెంచుకున్నాడు. చలనచిత్రములు అసలు ఎందుకు నిర్మించవలెను? ఎట్లు నిర్మించవలెను? నటన అనగా నేమి? దర్శకత్వము ఏ విధంగా వుండవలయును? - ఇలాంటి ప్రశ్నలన్నీ తనే వేసి, వాటికి సమాధానాలుగా తనే అందరిదగ్గరా వుపన్యాసాలివ్వడం ప్రారంభించాడు.

చిత్రాంగదరావ్‌కున్న మేథాశక్తి చూసి సినిమారంగంలోని ప్రముఖులు చాలామంది గుండెలు బాదుకున్నారు. ఇలాంటి రత్నాన్ని మరుగునపడిపో నివ్వటమా అని బాధపడి, చివరికి-ఒక పాత నిర్మాత తను తియ్యబోయే సరి కొత్త చిత్రంలో చిత్రాంగదరావ్‌కి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశమిచ్చాడు.

ఇంకేముంది? అప్పటినుంచీ చిత్రాంగదరావ్ శుక్లపక్ష చంద్రుడిలా రోజురోజుకీ పెరిగి పెద్దవాడైపోయాడు. కొన్నాళ్ళకి అసోసియేట్ దర్శకుడూ ఆ పిమ్మట అసలు దర్శకుడూ అయిపోయాడు.

ఎన్నో మహోజ్వల సాంఘిక చిత్రాలూ, మహత్తర కళాఖండాలూ అతని దర్శకత్వంలో వెలుపడ్డాయి. అతను దర్శకత్వం వహించిన చిత్రాలకి అశేష ప్రజాదరణ లభించింది. ఎన్నో చిత్రాలు అర్ధశత, శత, ద్విశత దినోత్సవాలు జరుపుకున్నాయి.

ఇంక లాభంలేదని, ఒక శుభ ముహూర్తాన తనే స్వయంగా చిత్ర నిర్మాణం ప్రారంభించాడు చిత్రాంగదరావ్. తను స్వంతంగా సినిమాలుతీస్తే తప్ప తన ఆశయసిద్ధికి అవకాశముండదనీ, అంతర్జాతీయ స్థాయిలో తన శక్తి సామర్ధ్యాలు వెల్లడికావడానికి వీలుండదనీ అనుకున్నాడు.

మొదటి చిత్రమే పంచరంగుల్లో భారీ ఎత్తున నిర్మించడానికి పూనుకున్నాడు. అగ్రశ్రేణి తారలందర్నీ బుక్‌చేశాడు. కథ; మాటలు; స్క్రీన్‌ప్లే; ఎడిటింగ్; దర్శకత్వం, అన్నిబాధ్యతలూ తనే నిర్వహించదల్చుకున్నాడు.

సినిమాపేరు యింకా నిర్ణయించలేదు. కథలో హీరో రిక్షా తొక్కుకుని బ్రతుకుతూ వుంటాడు. తన తల్లినీ, చెల్లెల్నీ, ఇద్దరు తమ్ముళ్ళనీ కూడా బ్రతికిస్తూ వుంటాడు. ఎప్పుడూ టెర్లిన్ చొక్కాలూ పాంట్లూ వేసుకుని జుట్టు కూడా చెదరనంత నీట్‌గా వుండటం వల్ల అతని రిక్షా ఎక్కిన ఒక జమీందారుకూతురూ, ఆ అమ్మాయి స్నేహితురాలూ ఇద్దరూ కూడా హీరోకి మనసిచ్చేస్తారు. ఎవరి మనసు పుచ్చుకోవాలో తెలీక హీరో తెగబాధపడిపోయి కొన్నాళ్ళు రిక్షాతొక్కడం మానేసి విషాదగీతాలు పాడుతూ రోడ్లమీద తిరుగుతాడు. అతనికోసం అతన్ని ప్రేమించిన అమ్మాయిలిద్దరూ పోటీపడి త్యాగాలమీద త్యాగాలుచేస్తారు. ఈలోగా హీరో తన చెల్లెల్ని పెద్ద ఆఫీసర్‌కిచ్చి చేస్తానని ప్రతిజ్ఞచేసి, రాత్రింబవళ్లు రిక్షా తొక్కి ఇరవైవేలు కూడబెట్టి చెల్లెలికి కట్నంగా యిచ్చి తన ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటాడు. హీరోని ప్రేమించిన జమీందార్ కూతురు ఫైనల్‌గా పెద్ద త్యాగం చేస్తుంది, తన ఆస్తిఅంతా రిక్షావాళ్ళకి రాసిపారేసి, విషంతాగి హీరోపాదాల చెంతపడి ప్రాణాలు విడుస్తుంది. హీరో, రిక్షాలో - హెలికాప్టర్‌మీద పారిపోతున్న విలన్‌ని వెంబడించి పట్టుకుని, కొండల మీదా, ఆకాశంలోనూ, సముద్రంలోపలా ఐదురోజులపాటు వాడితో హోరాహోరిగా పోరాడి, చంపేసి దేశాన్ని శత్రువుల బారినుంచి కాపాడతాడు. రెండో అమ్మాయిని పెళ్ళిచేసుకుని హాయిగా కాశ్మీర్‌లోనూ, కొడైకెనాల్‌లోనూ, వూటీలోనూ పాటలు పాడుకుంటూ వుంటాడు.

ఇదీ కథ. ఈ కథలో చిత్రాంగదరావ్ తన మేధాశక్తినంతా ఉపయోగించి, ధర్మమే జయించును; త్యాగానికి విలువలేదు; ప్రేమ అతి పవిత్రమైనది; దేశభక్తి చాలా అవసరము: భారతీయ సంప్రదాయములు విస్మరించరాదు మొదలైన ఎన్నోవిలువైనవిషయాలు ప్రజలకి భోధించడానికిగాను, తదనుగుణమైన ఎన్నో సంఘటనలూ సన్నివేశాలూ కల్పించాడు.

ఒక సముజ్వల సాంఘికచిత్రంగా, చలనచిత్ర చరిత్రలో ఒక నూతన యుగానికి నాందిగా తను తియ్యబోయే సినిమారూపొందగలదనీ ఖండఖండాంతరాల్లో తన కీర్తిచంద్రికలు వ్యాపించగలవనీ చిత్రాంగదరావ్ దృఢవిశ్వాసం.

అతని నమ్మకం నిజమేనన్నసంగతి ఆ సినిమాచూస్తే మీకూ తెలుస్తుంది. త్వరలో విడుదల ! తప్పక చూడండి !